క్లుప్తంగా...

అనురాగ్ విద్యార్థికి రజితం



రూపేశ్‌ను అభినందిస్తున్న డీన్ విజయ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, మల్లేశం తదితరులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఏఐఎంఎల్–ఎ రెండో సంవత్సరం చదువుతున్న రూపేశ్‌రెడ్డి ఇంటర్ గ్రూపు వాయు సైనిక క్యాంపు ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ అండ్ హైజీన్ పోటీల్లో రజిత పతకం గెలుచుకున్నాడు. ఏపీ, తెలంగాణ డీజీపీ ఏఐఆర్ కమాండర్ ఐఎం రెడ్డి పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో బుధవారం జరిగిన అభినందన సభలో డీన్, డాక్టర్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ సీటీఓ డాక్టర్ మల్లేశం, ఏఐ హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి, రఘు రజత పథక విజేత రూపేశ్‌ను అభినందించారు.

డీఎంహెచ్‌వోకు సత్కారం

ఉప్పల్: మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులైన డా.రఘునాథ్‌ను బుధవారం ఉప్పల్ పీహెచ్‌సీ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. డీఎంహెచ్‌లోనూ కలిసి వారిలో ఉప్పల్ వైద్యాధికారి డా.సౌందర్య లత, సూపరింటెండెంట్ భోగ ప్రకాశ్, సిగ్మతుల్లా తదితరులు ఉన్నారు.

రూల్స్ పాటించని వాహనదారులకు జరిమానా, జైలు

మల్కాజిగిరి: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి, నెంబర్ ప్లేట్స్ సరిగాలేని వారికి 5వ స్పెషల్ ఎంఎం కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించారని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. నెంబర్ ప్లేట్ సరిగాలేని ఒకరికి ఐదు రోజులు జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, ఇద్దరికి రెండు రోజులు జైలుశిక్ష రూ.2 వేల జరిమానా, ఒకరికి రూ.2 వేలు, మరొకరికి రూ.2,500లు జరిమానా విధించారన్నారు. మద్యం సేవించిన వారిలో ఐదుగురికి రూ.2 వేలు, ఆరుగురికి రూ.2,500లు, నలుగురికి రూ.3 వేలు, ముగ్గురికి రూ.3,500లు జరిమానా విధించారన్నారు. 23 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

అల్వాల్: మానసిక అనారోగ్యానికి గురైన వారికి చికిత్స అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు సేవలు అందిస్తున్నాయని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ ఆచార్య అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నేరేడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ సహకారంతో 15వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అవగాహన శిబిరంలో పాల్గొనాలని సూచించారు. బుధవారం బ్యాంక్ కాలనీలోని 500 మంది చెవిటి, మూగ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సైగల భాషతో విషయాన్ని చెప్పామన్నారు. కార్యక్రమంలో హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు పఠాన్ ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులూ.. బీకేర్ ఫుల్..



ఉప్పల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పొరపాట్లు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ డీసీపీ కార్యాలయంలో రాచకొండ పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలని సూచించారు. అందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద భద్రత ఉంచాలన్నారు. వీటితో పాటు ఎన్నికల విధుల్లో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వదంతులు సృష్టించే వారిపై, ఎక్కడైనా చిన్న గొడవలు జరిగినా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ల అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాయింట్ సీపీ అంబర్ కిషోర్, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, మల్కాజిగిరి డీసీపీ దారావత్ జానకీ, ఎస్‌వోటీ డీసీపీ గిరిధర్, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, డీసీపీ బాలస్వామి, సైబర్ డీసీపీ అనురాధ, అడ్మిన్ డీసీపీ ఇందిరా, ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



- సోషల్ మీడియాలో వచ్చే రాజకీయ అంశాలతో పాటు వార్తల పరిశీలన
- ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వచ్చే పోస్టులపై చర్యలు
- సంబంధిత అడ్మిన్‌కు నోటీసులు.. తర్వాత క్రిమినల్ కేసులు నమోదు
- కలెక్టర్ ఆధ్వర్యంలో ఆరుగురితో మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

నిఘా..!



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాస్త్ర, సాంకేతిక రంగాలు విస్తరించడంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. యువత అత్యధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలతో కొత్త వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయించి.. ప్రచార కార్యక్రమాలు నమోదు చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాల రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు హద్దులు దాటి గొడవలకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నియావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ప్రచార కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు పరిశీలన చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాల్లో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ప్రతి జిల్లాలో మీడియా మానిటరింగ్ కమిటీ

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాల్లో నమోదు చేస్తున్న ప్రచారం కార్యక్రమాలను పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ అధ్వర్యంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(యూఎల్‌సీ) వంశీమోహన్, ఈ–జిల్లా మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి(సోషల్ మీడియా నిపుణుడు), జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కిరణ్ కుమార్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు సభ్యులుగా ఉంటారు. వీరు ప్రతిరోజూ వివిధ దినపత్రికల్లో వచ్చే వార్తలు పరిశీలించడంతో పాటు స్థానిక సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు..

ఏదైనా సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల నాయకులను కించపర్చేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలను నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, లేక ఎన్నికల అధికారులు పరిశీలించిన సంబంధిత గ్రూప్ అడ్మిన్‌పై పోస్టులు నమోదు చేసిన వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయమూర్తి పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు చట్టపరంగా శిక్షిస్తారు. సాధారణ సమయంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తే నమోదు చేసే కేసులకు.. ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసులకు తేడా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని అంటున్నారు.

18న సీఎం కేసీఆర్ బహిరంగ సభ

జంగ్ తెలంగాణ 2023

- నా సత్తాచాటేలా గుండ్లపోచంపల్లిలో సభ
- 75 వేల మందితో విజయవంతం చేస్తాం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి మల్లారెడ్డి



గుండ్లపోచంపల్లిలో సభ స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రచారాన్ని వేగవంతం చేసింది. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్‌తో పెద్ద ఎత్తున బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 18న మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ అధిష్ఠానం వెల్లడించింది. ఈ మేరకు మేడ్చల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సభ నిర్వహించాలని భావిస్తున్న మంత్రి మల్లారెడ్డి సభ ఏర్పాట్లు చకచకా జరిగేలా నాయకులను పరుగులు పెట్టిస్తున్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బహిరంగ సభ..

మేడ్చల్ నియోజకవర్గంలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. 75 వేల మందితో సభ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించిన మంత్రి మల్లారెడ్డి అందుకు అనుగుణంగా ఔటర్ రింగు రోడ్డు మేడ్చల్ ఎగ్జిట్ పాయింట్‌కు సమీపంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 44వ జాతీయ రహదారి పక్కన సుమారు 50 ఎకరాల స్థలంలో సభకు ప్లాన్ చేశారు. 30 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభ, మరో 15 ఎకరాల్లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. శరవేగంగా పనులు చేపడుతున్నారు. మొదటిసారి మేడ్చల్‌కు వస్తున్న సీఎం కేసీఆర్‌కు తన సత్తాచాటేలా బహిరంగ సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సభ స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గంలోని 75 వేల మందితో సభను విజయవంతంగా నిర్వహిస్తామని, అందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు.



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి ఇతర నాయకులు

ఎన్నికల్లో నాకు పోటీ లేదు

ఘట్‌కేసర్: మేడ్చల్ నియోజకవర్గంలో నాకు పోటీ లేదు.. పోటీ చేద్దామంటే మజా లేకుండా పోతోందని, మూడొస్తలేదు, మాజా లేదు, సరైన పోటీ ఉంటే మైక్ టైసన్‌లా పంచ్ ఇచ్చేవాడినని, అందరూ డమ్మీ క్యాండెట్లు అని, పుప్పు అభ్యర్థులని మంత్రి మల్లారెడ్డి అన్నారు. చౌదరిగూడలో కాంగ్రెస్ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యురాలు సంయుక్త, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయుడు నాగేశ్, పులకంటి పద్మతో పాటు వందలాది మంది కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సర్పంచ్ రమాదేవి, మాజీ సర్పంచ్ రాములుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ముఖ్య అతిథిగా మంత్రి మల్లారెడ్డి హాజరై వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్లు మాధవరెడ్డి, రెడ్యనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, స్థానిక శాఖ అధ్యక్షుడు లింగంయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల మహిళ అధ్యక్షురాలు మంగ, జగన్‌మోహన్‌రెడ్డి, బాలేశ్ పాల్గొన్నారు

అమ్మ పొత్తిళ్లలోంచి.. ముళ్ల పొదల్లోకి..

- ఏడు రోజుల వయసున్న చిన్నారి లభ్యం
- శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగింత



ఘట్‌కేసర్: అమ్మ పొత్తిళ్లలో ఉండాల్సిన ఏడు రోజుల చిన్నారి ముళ్లపొదల్లో దర్శనమిచ్చిన ఘటన బుధవారం ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం పడమటి సోమారం గ్రామానికి చెందిన రమేశ్ తన భార్యతో కలిసి ఘట్‌కేసర్ నుంచి బాచారం వైపు ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా జేకే కన్వెన్షన్ సమీపంలో బైక్ ఆపి మూత్రవిసర్జన చేస్తుండగా సమీపంలో ముళ్ల పొదల్లో చిన్నారి ఏడుపు శబ్దం వినిపించింది. అక్కడి పొదల్లో పరిశీలించగా ఆడ శిశువు (సుమారు 7 రోజుల వయస్సు) కనిపించింది. వెంటనే 100 డయల్ చేశాడు. స్పందించిన డీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాము ఘటన స్థలానికి వెళ్లి చిన్నారిని వైద్యం కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం చిన్నారిని శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. గుర్తు తెలియని వ్యక్తులు పసికందును సాకలేక వ్యవసాయ క్షేత్రంలో వదిలిపెట్టి ఉండవచ్చని పోలీసుల భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హిందూ శ్మశానవాటిక స్థలాన్ని తమకే కేటాయించాలి



చౌదరిగూడ రెడ్డి శ్మశానవాటిక వద్ద నిరసనలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు

ఘట్‌కేసర్: చౌదరిగూడ రెడ్డి శ్మశాన భూమిని ఇతర మతానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆ శ్మశానవాటిక వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల శ్మశానవాటిక భూమిని ఓ వర్గానికి కేటాయించి ఇరువర్గాల మధ్య తగాదా సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన భూమిని ఇతర మతస్తులకు కేటాయించడం సమంజసం కాదని, ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. నిరసనలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, వార్డుసభ్యులు భోజిరెడ్డి, సుధాకర్, మాజీ వార్డు సభ్యులు సురేందర్‌రెడ్డి, నర్సింగ్ రావుముదిరాజ్, రెడ్డి సంఘం నేతలు విఘ్నేశ్వర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చేనేత ఖాదీ ఉత్పత్తుల మేళా ప్రారంభం



స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కిషనరావు, డా.అరుణ్ కుమార్



దసరా, బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభిస్తూ..

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామం బతుకమ్మ, దసరా పండగను పురస్కరించుకుని బుధవారం స్టేట్ హ్యాండ్లూమ్ చేనేత ఖాదీ ఉత్పత్తుల మేళాను విశ్రాంత ఐఏఎస్ అధికారి జి.కిషన్‌రావు వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డా.అరుణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 14 రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి నేత కార్మికులు వచ్చి నేరుగా విక్రయించుకునేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేత కార్మికులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చన్నారు. వినియోగదారులకు తక్కువ ధరల్లోనే లభిస్తాయన్నారు. జనరల్ మేనేజర్ అంజయ్య, ఏఈ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా, బతుకమ్మ వేడుకలు ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం దసరా, బతుకమ్మ ఉత్సవాలను శిల్పారామం రూపశిల్పి కిషన్‌రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 14 రోజుల పాటు శిల్పారామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పండగ జరుపుకుంటున్నట్లు తెలిపారు. నాట్యగురువు అరుణ శ్రీనివాస్ శిష్య బృందంచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎన్నికల సమయంలో బ్యాంకర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల సమయంలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా పరిధిలోని బ్యాంకర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకర్లతో ఎన్నికల వ్యయ మానిటరింగ్ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. నగదు లావాదేవీలు ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు తగిన ఆధారాలు ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి నిర్దేశించారు. రూ.50 వేలకంటే ఎక్కువ ఉంటే అందుకు తగిన రుజువులు, ధ్రువీకరణ పత్రాలు జతచేయాలని సూచించాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాస్పద లావాదేవీలు ఉంటే.. రోజువారీగా నివేదిక సంబంధిత ఎల్డీఎంకు అందజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లాలో బ్యాంకర్లు, నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమానులు చట్టం పరిధిలో ఉండాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫ్లెక్సీల యజమానులు ప్రజా ప్రతినిధ్య చట్టం పరిధిలో పనిచేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. బుధవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా జిల్లాలోని ప్రింటర్లు, ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రింటర్లందరూ ఫాంప్లేట్స్, స్టిక్కర్లు, పోస్టర్స్, ఫ్లెక్సీలు చేసే ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రింట్ చేసిన తరువాత పబ్లిషర్ పేరు, ఎన్ని కాపీలు ప్రింట్ చేశారు.. ఎంత మేర ఖర్చయ్యింది అనే తదితర వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ.. అందుకు సంబంధించి డిక్లరేషన్ ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం బుధవారం జిల్లా వ్యాప్తంగా 48 గంటలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టును అనుసరించి అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తంగా అన్నీ కలిపి ప్రభుత్వానికి సంబంధించినవి 8,450, ప్రైవేట్‌కు సంబంధించి 2,923.. మొత్తం 11,373 బ్యానర్లు, పోస్టర్లను తొలగించినట్లు తెలిపారు.

5 నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నియామకం

జిల్లా ఎన్నికల అధికారి అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా కీసర ఆర్డీఓ రాజేష్‌కుమార్, మల్కాజిగిరి ఎన్నికల అధికారిగా సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికుమార్, కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారిగా ఎస్డీసీ–ఎల్‌ఏ సైదులు, కూకట్‌పల్లి ఎన్నికల అధికారిగా మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్‌కుమార్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అభిషేక్ అగస్త్యను నియమించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే కోర్టు స్టే డ్రామా



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కీసర: రాంపల్లిలో నిర్మించిన 6,500 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో స్థానికంగా ఉన్న నిరుపేదలకు 10 శాతం కేటాయిస్తామని హామి ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మంత్రి మల్లారెడ్డి, అప్పటి సర్పంచ్ ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మోసం చేశారని నాగారం మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్ విమర్శించారు. రాంపల్లిలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి నగరంలోని వివిధ నియోజకవర్గ ప్రజలకు పంపిణీ చేశారని, స్థానికులకు ఇస్తామన్న 10 శాతం ఇళ్లు ఎందుకు పంపిణీ చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాంపల్లి ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఎన్నికల్లో మంత్రి మల్లారెడ్డికి లబ్ధి చేకూర్చేందుకు స్థానిక బీఆర్‌ఎస్ నేతలు డబుల్ ఇళ్లపై కోర్టు స్టే పేరుతో స్థానిక ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో 1వ వార్డు కౌన్సిలర్ పంబాల సరితారమేష్, కాంగ్రెస్ నేతలు సోమిరెడ్డి, పంబాల రమేష్, విగ్నేష్‌యాదవ్, నరేందర్, రఘుయాదవ్, ప్రవీణ్‌యాదవ్, ఓంప్రకాష్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, బలరాం, భూములు యాదవ్, బాల్‌రాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో ఎన్నికల్ కోడ్ బేఖాతర్..





మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ విధించగా గుండ్లపోచంపల్లిలో మాత్రం ఎన్నికల పరివర్తనా నియమావళిని అధికారులు పాటించడం లేదు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసి రెండు రోజులు అవుతున్నా అధికారులు మాత్రం ఇంకా మొద్దు నిద్రలోనే వ్యవహరిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని మినీ ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలతో పాటు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఎన్నికల్ కోడ్ సందర్భంగా ఎన్టీఆర్ వంటి విగ్రహాలకు ముసుగులు వేయాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. దాంతో పాటు పలు రాజకీయ పార్టీల జెండాలు ఎగురుతుండటంతో తమ మున్సిపాలిటీలో ఎన్నికల కోడ్ లేదా అని మున్సిపల్ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు.